బాలయ్య వీరమాస్?

సీనియర్ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ.. గత ఏడాది సంక్రాంతికి చేసిన హంగామా అంతా ఇంతాకాదు. ఒకరు 'వీరసింహారెడ్డి'గా, ఒకరు 'వాల్తేరు వీరయ్య'గా వచ్చి బ్లాక్‌బస్టర్స్ అందుకున్నారు. చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య'ను తెరకెక్కించిన కేఎస్ రవీంద్ర(బాబీ).. ప్రస్తుతం బాలయ్యతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా టైటిల్ విషయంలో ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. గత ఏడాది సంక్రాంతికి.. అటు బాలయ్యకూ, ఇటు బాబీకి కలిసి వచ్చిన 'వీర' సెంటిమెంట్‌ను మళ్లీ కొనసాగిస్తూ, ఈ తాజా చిత్రానికి కూడా 'వీర' అనే అక్షరాలు కలిసొచ్చేలా టైటిల్ పెట్టాలని మేకర్స్ యోచిస్తున్నారట. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'వీర మాస్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ టైటిల్‌ని నిర్మాత సూర్యదేవర నాగవంశీ రిజిస్టర్ చేయించినట్టు కూడా వార్తలొస్తున్నాయి. మరి అభిమానులు ఈ విషయంలో ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది. హిందూపురం శాసనసభ్యునిగా ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ బిజీగా ఉండటంతో, ఆయన లేని సన్నివేశాలను, అలాగే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు దర్శకుడు బాబీ.

ఆర్జీవీ కొత్త ప్రయోగం

రామ్‌గోపాల్‌వర్మ గతంలో ప్రయోగాత్మక చిత్రాల్ని తెరకెక్కించారు. ఆ తర్వాత చిత్ర నిర్మాణంలో ప్రయోగాలు మొదలుపెట్టారు. గతంలో ఓసారి సెల్‌ఫోన్‌తో కూడా సినిమా తీయొచ్చంటూ చర్చకు తెరలేపారు. తాజాగా సినీ నిర్మాణంలో మరో కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 'యువర్ ఫిల్మ్' అనే కొత్త కాన్సెప్ట్‌ని తీసుకొచ్చారు. ప్రజల చేత , ప్రజలకొరకు, ప్రజల కోసం ఎన్నుకున్నదే ప్రజాప్రభుత్వం అన్నట్టుగా ప్రేక్షకుల చేత, ప్రేక్షకుల కొరకు, ప్రేక్షకుల కోసం చేసే సినిమాలే మా 'యువర్‌ఫిల్మ్' ఐడియా అంటున్నారు రామ్‌గోపాల్‌వర్మ. తన వెబ్‌సైట్ ద్వారా ఓటింగ్ పద్ధతిలో సినిమాకు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్‌లతో పాటు, ప్రధాన టెక్నీషియన్స్ అందర్నీ ప్రేక్షకులే ఎన్నుకుంటారు. వారిలో ముందంజలో ఉన్న వారితో ఆరు నెలల్లో సినిమా తీసి విడుదల చేస్తామని ఆర్జీవీ తెలిపారు. అలాగే కథకు సంబంధించిన ఒకట్రెండు లైన్లు వెబ్‌సైట్‌లో పెడతామని, ఆ లైన్లు నచ్చిన యాక్టర్లు, డైరెక్టర్లు, డీవోపీలు, సంగీత దర్శకులు ఇలా ఎవరైనా సరే.. తాము ఆ సినిమాకు పనిచేయాలనుకుంటే అప్లయ్ చేసుకోవచ్చని అన్నారు. అప్లయ్ చేసుకున్న వారిలో ప్రేక్షకుల తీర్పు మేరకు వివిధ విభాగాల వారిని ఎన్నుకోవడం జరుగుతుందని, అలా ఎన్నుకున్నవారి నుంచి ఆర్జీవీ డెన్ టీమ్ షార్ట్ లిస్ట్ తయారు చేసి, వెబ్‌సైట్‌లో పెడుతుందని చెప్పారు. ఆ తర్వాత ఆడిషన్స్ జరుగుతాయని, అందులో ఉత్తీర్ణులైన వారితో సినిమా చేయడం జరుగుతుందని ఆర్జీవీ తెలిపారు.

అక్కడ అద్దె కట్టాల్సిన అవసరం లేదు

అందగత్తె మాత్రమే కాదు, ఆదాశర్మ అద్భుతమైన నటి కూడా. 'ది కేరళ స్టోరీ'తో నటిగా ప్రేక్షకుల హృదయాల్లో బలమైన ముద్ర వేసింది తను. ప్రస్తుతం ఆదాశర్మ ఏం చేసినా న్యూసే. తాజాగా దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఇంటిని కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఆ ఇంటిని చూడటానికి వెళ్లింది ఈ అందాల భామ. అంతే.. ఆ ఇంటిని తను కొనేసిందంటూ వార్తలు రావడం, ఇందులో భాగంగా సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అదే ఇంట్లో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడంటూ పాత స్టోరీలను తిప్పిరాయడం మొదలుపెట్టింది మీడియా. దాంతో ఆదాశర్మకు ఈ విషయంపై స్పందిచక తప్పలేదు. 'ఈ భూమ్మీద లేని వ్యక్తి గురించి ఇష్టం వచ్చినట్టు రాయడం.. మాట్లాడటం సమంజసం కాదు. సుశాంత్ గొప్ప సినిమాల్లో నటించారు. మంచి నటుడు. ఆయన గౌరవాన్ని కాపాడటం మనందరి ధర్మం. ఆ ఇంటిని కొనలేదు. చూడ్డానికి వెళ్లాను. దాంతో మీడియాపై నాపై ఫోకస్ పెట్టింది. నాపై ఆ మాత్రం ఫోకస్ ఉన్నందుకు సంతోషం. నేను ఆ ఇంటిని నిజంగా కొంటే తప్పకుండా అందరికీ చెబుతాను. ప్రస్తుతం ప్రేక్షకుల గుండెల్లో ఉంటున్నా. అద్దె చెల్లించాల్సిన అవసరం కూడా లేదు' అంటూ అందంగా నవ్వేసింది ఆదాశర్మ.

సీతా కల్యాణ వైభోగమే

సుమన్‌తేజ్, గరీమ చౌహాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీష్ పరమవేద దర్శకత్వం వహిస్తున్నారు. రాచాల యుగంధర్ నిర్మాత. శనివారం సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిచారు. 'తన ప్రేమను గెలిపించుకోవడానికి ఎంతదూరమైనా వెళ్లే యువకుడి కథ ఇది. కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. యాక్షన్ సన్నివేశాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పరశురామ్, సంగీతం: చరణ్ అర్జున్, దర్శకుడు: సతీష్ పరమవేద.

జూన్‌లో ఇండియన్-2

దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్న 'ఇండియన్-2' చిత్రంపై తాజా అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాను జూన్ నెలలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో 1996లో వచ్చిన సంచలన చిత్రం 'ఇండియన్'కు సీక్వెల్ ఇది. ఇందులో అవినీతికి వ్యతిరేకంగా పోరాడే స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా కమల్‌హాసన్ కనిపించనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో కమల్‌హాసన్ తెల్లటి ధోతి, కుర్తా ధరించి ఉన్నారు. చేతులకు సంకెళ్లు వేసి వున్నాయి. ఈ సీక్వెల్‌లో సేనాపతి అవినీతిపై చేసే పోరాటం సరికొత్త పంథాలో ఉంటుందని, చక్కటి సామాజిక సందేశంతో సినిమా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్నందిస్తున్నారు.

రొమాంటిక్ కామెడీ 'డియర్'

జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి.పృథ్వీరాజ్ నిర్మించారు. తమిళం, తెలుగు భాషల్లో వరుసగా ఈ నెల 11, 12వ తేదీల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దీనికి యువ హీరో నాగ చైతన్య వాయిస్ ఓవర్ అందించారు. ట్రైలర్‌లో నూతన వధూవరులుగా జీవీ ప్రకాష్‌కుమార్, ఐశ్వర్య రాజేష్ కనిపించారు. నాగచైతన్య వాయిస్ ఓవర్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్, ఏషియన్ సినిమాస్ విడుదల చేస్తున్నాయి. కాళి వెంకట్, ఇళవరసు, రోహిణి, తలైవాసల్ విజయ్ తదితరులు చిత్ర తారాగణం.

రహస్యంగా నిశ్చితార్థం చేసుకోలేదు!

కథానాయిక అదితిరావు హైదరీతో గత నెలలో జరిగిన తన వివాహ నిశ్చితార్థంపై హీరో సిద్ధార్థ్ తొలిసారి స్పందించారు. మార్చి 27న ఈ జంట నిశ్చితార్థ వేడుక వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయంలో ఇరు కుటుంబాల సన్నిహితుల సమక్షంలో అత్యంత గోప్యంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఎలాంటి ఫొటోలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాజాగా తన నిశ్చితార్థంపై ఓ అవార్డుల వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్ స్పందించారు. 'అందరూ అనుకుంటున్నట్లుగా అది సీక్రెట్ ఎంగేజ్‌మెంట్ కాదు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాల మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. మాది ప్రైవేట్ ఎంగేజ్‌మెంట్. కొద్దిమంది కుటుంబ సభ్యుల్ని ఆహ్వానించాం. ఆహ్వానం లేనివాళ్లు సీక్రెట్ ఫంక్షన్‌గా భావిస్తున్నారు. నిశ్చితార్థంలో ఎలాంటి గోప్యత లేదు. ఏం చేసినా పెద్దల నిర్ణయం ప్రకారమే జరుగుతుంది' అని సిద్ధార్థ్ చెప్పారు. 'మహా సముద్రం' చిత్రంలో సిద్ధార్థ్, అదితి రావు హైదరీ తొలిసారి కలిసి పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరు ప్రేమలో పడ్డారు.